క్లుప్తంగా


ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న బొడ్డేడ ప్రసాద్ తదితరులు

మునగపాక : ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి సత్యనారాయణ సేవలు ఎంతో అవసరమని ప్రసాద్ తెలిపారు. అలాగే బొత్స సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఆయన వెంట మునగపాక పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు ఉన్నారు.

రేపు మూలపేట గంగాలమ్మ తల్లి గుడి ప్రారంభం



గంగాలమ్మ తల్లి గుడి

మునగపాక : మండలంలోని మూలపేటలో నూతనంగా నిర్మించిన గంగాలమ్మ తల్లి గుడి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. భక్తుల విరాళాలతో నిర్మించిన ఆలయాన్ని ఈ నెల 19న ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి చక్కటి రంగులు వేశారు. భక్తులు కూర్చుని పూజలు చేసుకునేందుకు వీలుగా టైల్స్ వేశారు. ఉదయం 8.47 గంటలకు ఆలయ ప్రారంభం ఘనంగా నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధి నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా గుడివాడ, గుర్రాజుపేట పరిశ్రమల ఏరియా, బంగారమ్మపాలెం పరిశ్రమల ఏరియా, చినఉప్పలం చెరువులు ఉన్న ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెండు ఇసుక లారీల సీజ్

మునగపాక : మండలంలోని పాటిపల్లిలో ఎటువంటి రికార్డులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. అనకాపల్లి నుంచి పాటిపల్లి వైపునకు ఎటువంటి ఆధారాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు శుక్రవారం రాత్రి తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో రెండు ఇసుక లారీలను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మూలపేటలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తులు

మునగపాక : మండలంలోని మూలపేటలో శనివారం సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ గంగాలమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవ నేపథ్యంలో ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హోమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో ముగిశాయి. కొన్ని చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగాయి.

- కొన్ని చోట్ల స్వల్ప వివాదాలు
- ఎన్నికలు ఆపేందుకు 'కూటమి' మద్దతుదారుల యత్నాలు
- కోరం చాలని పాఠశాలల్లో వాయిదా



మంగవరం హైస్కూల్లో ఎస్ఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో నాయకులు



గొడ్డిచెర్లలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎన్నికైన 12 మంది డైరెక్టర్లు



రామచంద్రపురం ఎంపీయూపీ ఎస్ఎంసీ కమిటీ సభ్యుల విజయోత్సాహం



చినకలవలాపల్లి స్కూల్ కమిటీ చైర్మన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల అభినందనలు



వాడనర్సాపురం పాఠశాల ఎదుట ఉపాధ్యాయులు, పోలీసులతో గొడవపడుతున్న కూటమి నేతలు



దాడులకు దిగుతున్న కూటమి నేతలను నిలువరిస్తున్న పోలీసులు



వాడనర్సాపురం స్కూల్ కమిటీ చైర్మన్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో శనివారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలు అక్కడక్కడ స్వల్ప వివాదాలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. నక్కపల్లి మండలంలోని 73 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు గాను 70 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 3 పాఠశాలల్లో ఎంపీపీఎస్ గొడిచెర్ల, జెడ్పీ గొడిచెర్ల, జెడ్పీ రాజయ్యపేట తగు కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. ఆ పాఠశాలల్లో తదుపరి ఎన్నికల తేదీలను జిల్లా విద్యాశాఖ అధికారులు తెలియజేస్తామన్నారు.

- గొడిచెర్ల ఎలిమెంటరీ పాఠశాలలో 12 మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గెలిచారు. రెండో తరగతికి సంబంధించిన ఓటర్లు రాక కోరం లేక చైర్మన్ ఎన్నిక వాయిదా వేశారు. ఇదే గ్రామంలో జెడ్పీ పాఠశాలలో మొత్తం 620 మంది పేరెంట్స్‌కి గాను 179 మంది మాత్రమే రావడంతో కోరం లేక ఇక్కడ ఎన్నిక వాయిదా వేశారు. బుచ్చిరాజుపేటలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. సభ్యుల ఎన్నిక అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. తదుపరి కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో తెలిపారు.

'కూటమి' రాజకీయాలు

ఈ ఎన్నికలను కూడా టీడీపీ, జనసేన పార్టీలు రాజకీయం చేశాయి. తమకు సరైన మద్దతుదారులు లేనప్పటికీ ఒత్తిడి చేయడం, బెదిరించి తమ వైపు తిప్పుకొని గెలుపొందాలని ప్రయత్నం చేశారు. అయినప్పటికీ చాలా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, అభిమానులు ఎస్ఎంసీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్లుగా విజయం సాధించడం విశేషం.

వాడనర్సాపురంలో దాడులకు కూటమి నేతల యత్నం..

రాంబిల్లి(యలమంచిలి) : మండలంలోని వాడనర్సాపురంలో శనివారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు విజయం సాధించడంతో ఎన్నికలను ఆపాలన్న దురుద్దేశంతో కూటమి నేతలు మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాఠశాల హెచ్ఎం, పోలీసులు, సాక్షి విలేకరిపై దాడులకు తెగబడ్డారు. సమాచారం తెలుసుకున్న రాంబిల్లి సీఐ నర్సింగరావు ఘటనాస్థలికి వచ్చి కూటమి నేతలకు సర్ది చెప్పారు. అయితే వారు పాఠశాల ఎదుట బైఠాయించి ఎన్నికలు వాయిదా వేసి బ్యాలెట్ పద్ధతిలో జరిపించాలని హెచ్ఎం, సీఐ నర్సింగరావును కోరారు. దానికి హెచ్ఎం బదులిస్తూ ఎన్నికలు నిబంధనల ప్రకారమే జరిగాయన్నారు. ఇదంతా ఫొటోలు తీస్తున్న సాక్షి విలేకరిపై కూటమి నేతలు దాడికి యత్నించారు. ఈ వార్త పేపర్‌లో రాస్తే అంతు తేలుస్తామని.. ఫొటోలు డిలీట్ చేయాలంటూ ఒకనొక దశలో దాడికి యత్నించారు. దీనిపై పోలీసులకు తెలిపినా పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది.

పంచదార్లలో మరో వివాదం..

అలాగే పంచదార్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్నికలు సజావుగా జరగలేదంటూ భోగాపురం గ్రామానికి చెందిన ధూళి సత్య పాఠశాల హెచ్ఎంపై రాంబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ పంచదార్లలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలను కూటమి నేతలకు అనుకూలంగా ఏకపక్షంగా పాఠశాల హెచ్ఎం జరిపించారని ఆరోపించారు. అన్ని గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు కమిటీలో చోటు లేకుండా చేసి తమకు అనుకూలంగా ఎన్నికలు జరిపించారని విమర్శించారు. ఇక్కడి పాఠశాలలో తన ఇద్దరు పిల్లలు చదువుతున్నా తనకు ఓటు హక్కు కల్పించలేదన్నారు. కమిటీలో చోటివ్వాలని అడిగినా ఇవ్వలేదని, తన అభిప్రాయం తెలుసుకోలేదన్నారు. తాను వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడినని ఇలా చేశారన్నారు. హెచ్ఎంపై చర్యలు తీసుకుని, మళ్లీ ఎన్నిక జరపాలని ధూళి సత్య డిమాండ్ చేశారు. దీనిపై రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అధికారులు న్యాయం చేయాలన్నారు.

మండలంలో వాడనర్సాపురం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా వాసుపల్లి తేజ, వైస్ చైర్మన్‌గా కొవిరి జ్యోతి ఎన్నికయ్యారు. 24 మంది డైరెక్టర్లకు గాను 22 మంది వైఎస్సార్సీపీ మద్దతు డైరెక్టర్లతో చైర్మన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొవిరి జ్యోతిని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కొవిరి రామకృష్ణ, కార్యకర్తలు అభినందించారు. అలాగే రాంబిల్లి మండలం చినకలవలాపల్లి వైఎస్సార్‌సీపీ మద్దతుతో స్కూల్ కమిటీ చైర్మన్‌గా పిట్ల రాజు, వైస్ చైర్మన్‌గా జల్లి కరుణ ఎన్నికయినట్లు తెలిపారు. వీరిని చినకలవలాపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి అభినందించారు.

4 పాఠశాలల్లో వాయిదా

కోటవురట్ల: మండలంలో 51 పాఠశాలలు ఉండగా 47 పాఠశాలల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. 4 పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేశారు.

ఆర్‌సీ పురం కమిటీ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే..

కోటవురట్ల మండలం రామచంద్రపురం ఎంపీయూపీ స్కూల్‌లో శనివారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. ఏకంగా 24మంది సభ్యులకు గాను 24 మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులే ఎన్నికయ్యారు. చైర్మన్‌గా నక్కన లోవరాజు, వైస్ చైర్మన్‌గా ప్రసాదుల వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ్, వైఎస్సార్ సీపీ నాయకులు చవ్వాకుల చిన్న, పులి చంటి, సోమేశ్వరరావు, బత్తుల రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కైలాసపట్నంలో వివాదాస్పదం



పంచదార్లలో ఎన్నికలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ధూళి సత్య

కైలాసపట్నంలోని ఎంపీపీ స్కూల్‌లో జరిగిన ఎన్నికలు వివాదాస్పదమయ్యాయి. ఎస్ఎంసీ కమిటీకి సంబంధించి 25 మంది సభ్యులకు గాను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 18 మందితో పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అయితే టీడీపీ నేతల ఒత్తిడితో మహిళలు తక్కువగా ఉన్నందున కోరం సరిపోలేదంటూ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసి కమిటీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అయినా అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి వెళ్లిపోయారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు..

అచ్యుతాపురం :మండల పరిధిలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఎన్నికల్లో అధిక శాతం ఏకగ్రీవంగా ముగిశాయి. అవసరమైన చోట చేతులు ఎత్తి కొత్త కమిటీ సభ్యుల్ని ఎన్నుకున్నారు.

మునగపాక జెడ్పీ హైస్కూల్లో..

మునగపాక : స్కూల్ కమిటీ ఎన్నికల్లో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్‌గా ఆడారి సూర్య చంద్రరావు, వైస్ చైర్‌పర్సన్‌గా బొడ్డేడ గిరిజ, పాటిపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం చైర్మన్‌గా యలమంచిలి హైమ, వైస్ చైర్మన్‌గా ఆర్‌వీ నాయుడు, నాగులాపల్లి హైస్కూల్ చైర్మన్‌గా పొలమరశెట్టి మురళి నూకాలయ్య, వైస్ చైర్‌పర్సన్‌గా పెంటకోట శ్రీదేవి, గణపర్తి హైస్కూల్ చైర్మన్‌గా కాండ్రేగుల వెంకటరావు, వైస్ చైర్‌పర్సన్‌గా ధనలక్ష్మి ఎన్నికయ్యారు. తిమ్మరాజుపేట హై స్కూల్ చైర్మన్‌గా పెంటకోట అప్పారావు, వైస్ చైర్‌పర్సన్‌గా మూల్గా సంతోషి, తోటాడ హైస్కూల్ చైర్మన్‌గా కె.సంతోష్, వైస్ చైర్‌పర్సన్‌గా బొడ్డేడ ఉమాలక్ష్మి, వాడ్రాపల్లి హైస్కూల్ చైర్మన్‌గా విల్లూరి ఆది వెంకటప్పారావు, వైస్ చైర్‌పర్సన్‌గా మొల్లి సరోజిని, పాటిపల్లి మోడల్ స్కూల్ చైర్మన్‌గా భీశెట్టి జోగినాయుడు, వైస్ చైర్‌పర్సన్‌గా దాడి అరుణ ఎన్నికయ్యారు. వారికి ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

స్కూల్ కమిటీ ఎన్నికల్లో కూటమిలో కుమ్ములాట..

స్కూల్‌కమిటీ ఎన్నికల నేపథ్యంలో కూటమి నుంచి రెండు పార్టీలకు చెందిన నాయకులు తమ మద్దతుదారులను బరిలో దించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో స్థానికులు కూటమి నాయకుల పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ పదవి కోసం బీజేపీ, జనసేన నాయకులు తమ తమ ప్యానళ్ల ఏర్పాటుకు సిద్ధం చేసుకుని ప్రచారం చేశారు. జనసేన నుంచి కరణం సంతోష్ ప్యానల్, బీజేపీ నుంచి పొలమరశెట్టి నాగేశ్వరరావు ప్యానల్ హోరాహోరీగా ప్రచారం చేసుకున్నాయి. కూటమికి చెందిన పార్టీల నేతలు ఐక్యంగా వ్యవహరించాల్సింది పోయి ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు విడిపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

56 పాఠశాలల్లో సామరస్యంగా నిర్వహణ

పాయకరావుపేట: మండలంలోని 57 పాఠశాలలకు గాను 56 పాఠశాలల్లో ఎన్నికలను ఆయా పార్టీల మద్దతుదారులు సామరస్యంతో నిర్వహించారు. ఒక్క పాఠశాలలో మాత్రం వాయిదా పడింది. ఎస్.నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్నిక కోరం లేక వాయిదా పడిందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఝాన్సీ తెలిపారు. 476 మంది విద్యార్థులకు గాను 106 మంది విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. మండల పరిధిలోని 12 ఉన్నత, 40 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎంఈవోలు కె.ఎస్. గాంధీ, జి.రమేష్‌బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

50 పాఠశాలల్లో ఏకగ్రీవం

ఎస్.రాయవరం: మండలంలో 66 పాఠశాలకు గాను 64 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 50 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. 14 పాఠశాలల్లో ఎన్నిక నిర్వహించారు. దార్లపూడి ఉన్నత పాఠశాల, భీమవరం పాఠశాలలో కోరం లేక ఎన్నిక వాయిదా పడినట్టు ఎంఈవో ఏఎస్ఎస్ఎస్ మూర్తి తెలిపారు. పెట్టుగోళ్లపల్లి, రేవుపోలవరం, భీమవరం గ్రామాల్లో ఇరు వర్గాల మధ్య పోటాపోటీ వాతావరణం నెలకొనడంతో పోలీసుల సమక్షంలో ఎన్నిక నిర్వహించారు.

ఏటికొప్పాక జెడ్పీ హైస్కూల్లో నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎన్నిక..

యలమంచిలి రూరల్ : మండలంలోని ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో శనివారం ముందుగా 6,7,8 తరగతులకు కమిటీలో ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకున్నారు. ఆ తర్వాత 9,10 తరగతుల సభ్యులను ఎన్నుకునేందుకు సరిపడా 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరు కాలేదు. మధ్యాహ్నం 1 గంట తర్వాత కోరం సరిపోక ఎన్నిక నిర్వహించడం లేదని ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ చెప్పడంతో వైఎస్సార్‌సీపీ నేతలు అక్కడ్నుంచి బయటికి వచ్చేశారు. వారు బయటికి వెళ్లిన తర్వాత మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత 9,10 తరగతులకు కమిటీ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. టీడీపీ మద్దతుదారులను ఎన్నికైనట్టు ప్రకటించారు. దీనిపై గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత సేనాపతి రాము హెచ్ఎంను నిలదీస్తే ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎన్నిక నిర్వహించామని చెప్పారన్నారు. ఈ విషయంపై యలమంచిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. కొత్తలి, లక్కవరం, పురుషోత్తపురం, సోమలింగపాలెం, పులపర్తి, యలమంచిలి పట్టణంలోని స్కూళ్లలో టీడీపీ, జనసేన నాయకులు తమ మద్దతుదారులనే కమిటీల్లో ఉండేలా ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు.

భగ్గుమన్న వైద్య లోకం

- మహిళా డాక్టర్ అత్యాచార ఘటనపై ఆగ్రహ జ్వాలలు



నక్కపల్లిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది



కోటవురట్ల సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ సిబ్బంది



యలమంచిలిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

యలమంచిలి రూరల్ : కోల్‌కతాలోని ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా వైద్యురాలిపై అత్యాచార ఘటనలో న్యాయం కోరుతూ శనివారం యలమంచిలిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. వైద్యురాలిపై అత్యంత పాశవికంగా లైంగిక దాడి చేసి దారుణంగా హత్య చేయడం హేయమైన చర్య అని యలమంచిలి 30 పడకల సామాజిక ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఆర్.నీహారిక అభిప్రాయపడ్డారు. ఈ కేసులో బలమైన సాక్ష్యాధారాలను ధ్వంసం చేశారన్నారు. పలు ప్రజా, విద్యార్థి సంఘాల మద్దతుతో పట్టణంలోని ప్రధాన రహదారిపై ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. నో సేఫ్టీ, నో డ్యూటీ, వియ్ వాంట్ జస్టిస్, సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. స్థానిక పాత ఆస్పత్రి భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిరసన చేపట్టిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్లు సుభాష్, వేదవ్యాస్, స్ఫూర్తి, మౌనిక, విజయ్, హెడ్ నర్స్ రత్నం, ప్రైవేటు డాక్టర్లు మహాలక్ష్మి, వెంకట్, పట్టణానికి చెందిన పలువురు దంత వైద్యులు, సీఐటీయూ నేత శివాజీ, ఎస్ఎఫ్ఐ నేత మలపల్లి బాలాజీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో ర్యాలీ, మానవహారం

పాయకరావుపేట: కోల్‌కత్తా ఘటనను ఖండిస్తూ పాయకరావుపేట, మంగవరం పీహెచ్‌సీల వైద్యాధికారులు వి.ఎస్. సౌందర్య, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ర్యాలీలో ఎంపీహెచ్‌ఈవో పి.వి.రమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో నిరసన గళం

కోటవురట్ల: స్థానిక సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ చేసి కోటవురట్ల ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోషులను ఉరి తీయాలి

నక్కపల్లి: కోల్‌కత్తాలోని పీజీ ట్రెయినీపై అఘాయిత్యానికి పాల్పడిన వారికి ఉరి శిక్ష వేయాలని వైద్యులు డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారాన్ని ఖండిస్తూ నక్కపల్లి మండలంలోని వైద్యులు నిరసన తెలిపారు. నక్కపల్లి ఏరియా ఆస్పత్రి, గొడిచెర్ల పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. ఆందోళనలో వైద్యులతో పాటు పారా మెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మునగపాకలో ర్యాలీ, మానవహారం

మునగపాక : కోల్‌కతా వైద్యురాలి అత్యాచార ఘటనకు నిరసనగా మండల కేంద్రమైన మునగపాకలో వైద్య సిబ్బంది ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు విమలగిరి, వినోద్‌కుమార్, దుర్గ ప్రవల్లిక మాట్లాడుతూ మహిళా డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, వైద్యులకు రక్షణ కల్పించాలన్నారు. ప్రత్యేక చట్టం తీసుకువచ్చి వైద్యులకు రక్షణగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దేవకాంత, హెచ్ఎస్ఎం ఎం.నాగేశ్వరరావు, హెచ్‌వీ సీతా మహాలక్ష్మి, యూడీసీ విజయలక్ష్మి, చూచుకొండ, మునగపాక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో మానవహారం..

అచ్యుతాపురం : బెంగాల్‌లో పీజీ విద్యార్థినిపై జరిగిన దురాఘతానికి నిరసనగా అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ, అచ్యుతాపురం పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. హరిపాలెం పీహెచ్‌సీ ఎదురుగా సిబ్బంది నినాదాలు చేశారు. తక్షణమే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వైద్యాధికారి వసంత్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేశ్, పీహెచ్‌సీ సిబ్బంది శిరీష, శాంతి, గణేశ్, నాగేశ్వరరావు, రమణ అచ్యుతాపురంలో వైద్యాధికారి శ్రావ్య ఆధ్వర్యంలో మనవహారం నిర్వహించారు. వైద్యులు వెంకటేశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



హరిపాలెం పీహెచ్‌సీ ఎదురుగా నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది



అచ్యుతాపురంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

నాతవరం: ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు అందించారు. ఇక్కడ ప్రాంగణంలో మొక్కలు నాటారు. యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏడీ బాబు, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పైల స్వామినాయుడు, హుస్సేన్, విలేకరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్ లారీ



కృష్ణంపాలెం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్ లారీ

రాంబిల్లి (యలమంచిలి) : మండలంలో కృష్ణంపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి టిప్పర్ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. అది ముక్కలవడంతో కరెంట్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేదని స్థానికులు తెలిపారు.

పెద్దేరు నుంచి 120 క్యూసెక్కుల విడుదల

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయం నుంచి 120 క్యూసెక్కులు సాగునీరు విడుదల చేస్తున్నామని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల నుంచి పెద్దేరులోకి ఇన్‌ఫ్లో తగ్గుతున్నా, ఆయకట్టులో 15 వేల ఎకరాలకు సాగునీరు ఢోకా లేదన్నారు. పెద్దేరు గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 135.30 మీటర్ల వద్ద నిలకడగా ఉందన్నారు. జలాశయంలోకి నాలుగు రోజులుగా 200 క్యూసెక్కులు వచ్చే వరద నీరు ప్రస్తుతానికి 50 క్యూసెక్కులకు తగ్గిందని తెలిపారు.